క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక గురుకుల పాఠశాలలో జరిగే ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ట్రై సైకిల్స్, చెవిటి మిషన్లు, మూగవారికి టచ్ ఫోన్లు, వికలాంగులకు చంక కట్టెలు, చేతి కర్రలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పురి మేరి అధ్యక్షతన జరిగే అభివృద్ధి పనులపై రివ్యూ సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారని నగర కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

వల్లూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను కడప డీఎస్పీ షరీఫ్ శుక్రవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను గురించి, స్టేషన్‌లో వున్న సిబ్బంది గురించి ఆరా తీశారు. త్వరలో రాబోవు ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన విధానాలు, చేపట్టాల్సిన చర్యలను గురించి పలు సూచనలు చేశారు. ఎన్నికలకు అన్ని విధాలుగా సిద్ధంగా వుండాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రి పూట గస్తీని ముమ్మురం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, ఇంచార్జ్ ఎస్‌ఐ హృషీకేశవరెడ్డి, సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జమ్మలమడుగు : పట్టణ, మండల పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎర్పడుతుందని డీఈ రాజగోపాల్, ఏఈ రాజబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం పట్టణ పరిధిలో ఉన్న సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది గంటలనుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలన్నారు.

21 నుంచి సమ్మెకు పిలుపు

జమ్మలమడుగు : మున్సిపల్ కార్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఈనెల 21వ తేదీ నుంచి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మెబాట పట్టినట్లు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు నాగన్న, ప్రధాన కార్యదర్శి శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డికి సమ్మె నొటిసు ఇచ్చారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించేవరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు.

ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న సర్పంచ్ చల్లా ప్రమీల

చెన్నూరు : మండలంలోని గుర్రంపాడు పంచాయతీకి చెందిన బుడ్డగాల పక్కీరయ్య కుమార్తె బుడ్డగాల రజినీ వివాహానికి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం వధువు తండ్రి ఫకీరయ్యకు రూ.5 వేలు ఆర్థికసాయాన్ని గుర్రంపాడు సర్పంచ్ చల్ల ప్రమీల అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం

పులివెందుల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆయన విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్రతిభను బయటకు తీయాలన్నారు. విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న వారు, ఇంకా పేర్లు నమోదు చేసుకోని వారు పేర్లు నమోదు చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలలో మంచి ప్రతిభ చూపి కళాశాలకు మంచి పేరు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



సోపాల వీరా

పులివెందుల రూరల్: వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సోపాల వీరాను నియమించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



బి.భారతి

వేంపల్లె : బీసీ విభాగపు రాష్ట్ర కార్యదర్శిగా వేంపల్లె పట్టణానికి చెందిన బి.భారతిని నియమించారు. బి.భారతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీసీ విభాగపు కమిటీలో స్థానం కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీసీలకు అన్ని రంగాలలో అధిక ప్రాధాన్యత కల్పిస్తూ అండగా నిలవడం సీఎం వైఎస్ జగన్‌కు సాధ్యమైందన్నారు. మరింత కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా పటేల్, పొట్టి శ్రీరాముల వర్ధంతి



ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



కమలాపురంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్, పొట్టిశ్రీరాములు వర్ధంతిలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా కళాశాల డీన్ ఎం.ఎస్.బేగ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్వతంత్ర్య భారతదేశాన్ని నిర్మించడంలో కీలక పాత్ర వహించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్‌వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత దేశ సమైక్యతకు ఉక్కు సంకల్పంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : అమరజీవి పొట్టి శ్రీరాములుకు చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి గౌరవాన్ని పెంచడం కోసం తన ప్రాణాలను త్యాగం చేసి తెలుగురాష్ట్రం ఎర్పాటుకు పోరాటం చేసిన వ్యక్తి పొట్టిశ్రీరాములు అని కొనియాడారు.

కమలాపురంలో..

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారత రత్న అవార్డు ప్రకటించాలని పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి సురేష్ తెలిపారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కోదండ రామాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాంధ్ర ప్రదేశ్ ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములకు భారత రత్న అవార్డు ప్రకటించాలన్నారు. అలాగే రాజధాని ప్రాంతంలో ఒక స్మృతివనం ఏర్పాటు చేసి అక్కడ పెద్ద విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి రమణయ్య, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పులివెందుల అభివృద్ధి కనిపించలేదా'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పట్టణాన్ని మోడల్ సిటీగా మార్చాలన్న లక్ష్యంతో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పులివెందులను అభివృద్ధి చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక లేనిపోని మాటలు చెబుతున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చంద్రమౌళి, పార్నపల్లె కిశోర్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రజలకు 600 హామీలు ఇచ్చారని.. ఆరు హామీలు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ నాయకులకు రాష్ట్ర ప్రజలే గట్టి బుద్ధి చెప్పి డిపాజిట్లు కూడా రాకుండా చేస్తారన్నారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక సీట్లు సాధించి మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని పులివెందులలో నిర్వహించి వ్యాపారస్తుల వద్దకు వెళ్లి లేనిపోని మాటలు చెప్పినా ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని.. టీడీపీ నాయకులకు ఓట్లు వేయరన్నారు. ధైర్యం ఉంటే టీడీపీ నాయకులు పులివెందులకు ఏమి చేశారో చెప్పాలన్నారు. పులివెందుల ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా తీసుకొచ్చే విధంగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. సిరి బండి విషయంపై కూడా బీటెక్ రవి రాజకీయ కోణంలో మాట్లాడటం సరికాదన్నారు. ప్రజల అభిప్రాయం తీసుకుని అన్ని వర్గాలకు అనుగుణంగా సిరిబండి వెళ్లే విధంగా రెండున్నర అడుగుల ఎత్తు తగ్గించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే సీఎం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



మామిడి తోటలో అంతర పంటలను పరిశీలిస్తున్న వసంతకుమారి

కమలాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయం గడించవచ్చని ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం వసంతకుమారి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దచెప్పలిలో కౌలు రైతు బషీరున్ మామిడి తోటలో అంతర పంటలుగా సాగు చేసిన వంగ, బెండ, గోవాకు, మిరప, టమోటా, బంతి తదితర పంటలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యయసాయం ద్వారా 365 రోజులు పంటలు సాగు చేయవచ్చన్నారు. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించవచ్చన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తినడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే 15 రోజులకే ఆదాయం వచ్చే పంటలు సైతం పండించవచ్చన్నారు. కౌలు రైతు బషీరున్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, వెలుగు ఏపీఎం అపర్ణదేవి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌కు విశేష స్పందన

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారులు జాఫర్ సాధిక్, అనితలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అన్ని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. అన్ని విభాగాల్లో ప్రథమ స్థానం నిలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఈనెల 19వ తేదీన నిర్వహించే జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. వ్యక్తిగత విభాగంలో ప్రథమ బహుమతి లక్ష్మీచరణ్ పాలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మి ద్వితీయ బహుమతి సంగమేశ్వర ఉన్నత పాఠశాల వీరపునాయునిపల్లె, తృతీయ బహుమతి అనురాధ గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సాధించారు. గ్రూపు విభాగంలో ప్రథమస్థానం గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానం ఉరుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పాలగిరి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.

ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో పరిశుభ్రతలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామిగుప్తా తెలిపారు. శుక్రవారం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్వచ్ఛభారత్‌పై విద్యార్థులు ర్యాలీగా వెళ్లి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 3, 13 విభాగాల ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోని ఏ, బి, వన్ సివిల్ విభాగాలలో పరిసరాలను శుభ్రపరిచి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించినట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు పరిశుభ్రతపట్ల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రొగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బి.విశ్వనాథరెడ్డి, ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సంద్ర, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జికి ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్/కడప కల్చరల్ / కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మరణం బాధాకరమని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకివీడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ సాబ్జి దుర్మరణం చెందారన్నారు. సైన్స్ ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే స్థాయికి చేరుకోవడం ఆయన పోరాట తత్వానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీగా ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై కౌన్సిల్‌లో నమ్మకమైన గొంతుగా పనిచేశారన్నారు. ఆయన అకాల మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.

– ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఉద్యమ నేత షేక్ సాబ్జి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరనిలోటని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా అన్నారు. శుక్రవారం కడపలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

రేపు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి) లో ఆదివారం మధ్యాహ్నం నుంచి కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయికి ఎంపికైన వైజ్ఞానిక ప్రదర్శనలు

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగి మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయి. వ్యక్తిగత విభాగంలో గైడ్ టీచర్ జయాకర్ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థిని కరిష్మా ప్రదర్శించిన వాటర్‌ప్యూరిఫికేషన్ సిస్టం, గ్రూపు విభాగంలో ఉప్పలూరుకు చెందిన శివాజీ, మునికార్తీక్‌లు గైడ్ టీచర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఆటోమేటిక్ లేసర్ లైట్, ఉపాధ్యాయ విభాగంలో హరిప్రియ రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ ఆక్టివిటీస్ టు టీచ్ స్టూడెంట్ అను ప్రాజెక్టులు జిల్లాస్థాయికి ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు రాజబాబు తెలిపారు. ఈనెల 19వ తేదీన ప్రొద్దుటూరులో జరిగే జిల్లాస్థాయి పోటీలో వీరు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనలో ఎంఈవోలు సుబ్బారావు, నాగేశ్వరరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

చెన్నూరు : వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాతృమూర్తి గుమ్మా సుబ్బమ్మ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లిలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్మానం



వైఎస్ మనోహర్‌రెడ్డిని సత్కరిస్తున్న గండి క్షేత్ర బోర్డు మెంబర్ సోమా కళావతి, తదితరులు

పులివెందుల రూరల్ : తాను గండి దేవస్థానం బోర్డు మెంబర్‌గా ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ మునిసిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిని కల్లమల్ల సోమా కళావతి శుక్రవారం సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్స్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ప్రధాన రహదారికి రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ళపొదలను శుక్రవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తన సొంత నిధులతో తొలగించారు. గతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు రోడ్డుకి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని కోరడంతో ఎమ్మెల్యే తన వ్యక్తిగత కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు.

ఆర్టీసీ ఉద్యోగులు సహనంతో వ్యవహరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రయాణికుల పట్ల ఓపిక, సహనంతో వ్యవహరించాలని కడప జోన్ ఇన్‌చార్జి ఈడీ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప డీపీటీఓ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఇంధన పొదుపు చేయని డ్రైవర్లకు, సెంట్రల్ సెల్ కంప్లైంట్స్ వచ్చిన సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రయాణికుల పట్ల గౌరవ ప్రదంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా ఓర్పు, సహనం అనేది ముఖ్యమని గుర్తించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ పొలిమేర గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ పి.భాస్కర్, ఇన్‌ఛార్జి సీటీఎం హరి, చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి, ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, జమ్మలమడుగు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్ఎంఏ బాష, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ప్రజలకు బ్రోచర్‌ను అందిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారని మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక చెన్నారెడ్డి కాలనీ, క్రిష్టియన్‌లైన్ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తే అన్నివర్గాల ప్రజలకు మరిన్ని పథకాలు అందిస్తారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి గడపకు గడపకు మన ప్రభుత్వ పథక బ్రోచర్లను అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్లు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, ఆ వార్డు కౌన్సిలర్ కాంతమ్మ, వైఎస్సార్సీపీ నాయకులు రసూల్, బ్యాటరీ ప్రసాద్, డేనియల్ బాబు, చంద్రమౌళి, సిద్ధయ్య, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించడమే సీఎం లక్ష్యం

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన విద్యను అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిల్లల భవిష్యత్ బాగుండాలని, కార్పొరేట్‌స్థాయి విద్య అందించాలన్న ఉద్దేశ్యంతో విద్యార్థులకు ట్యాబ్‌లను అందించడం జరిగిందన్నారు. కోట్ల రూపాయల ఖర్చుతో మెరుగైన విద్య కోసం బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం తీసుకోని విధంగా విప్లవాత్మక నిర్ణయాలు విద్యా వ్యవస్థలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. ఎల్లో మీడియా రాజకీయం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం ద్వారా చదువు చెప్పి రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో ప్రక్షాళన దిశగా విద్యా విధానంలో మార్పులు చేస్తుంటే రాష్ట్రంలో ఎల్లోమీడియా పిల్లల చదువులపై కూడా విషం చిమ్మే రాతలు రాడం మానుకోవాలన్నారు. రాబోయే ఎన్నికలలో వారికి తగిన గుణపాఠం చెప్పే రోజులు కూడా దగ్గరలోనే ఉన్నాయన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



వేంపల్లెలో నిరసనకు మద్దతు తెలుపుతున్న ఎల్.నాగసుబ్బారెడ్డి, తదితరులు

వేంపల్లె : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన సమ్మెను విచ్చిన్నం చేయాలనుకుంటే ఊరుకోమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నాలుగు రోజులుగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ప్రాజెక్ట్ పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీరపునాయునిపల్లె మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మూకుమ్మడిగా సెంటర్లను మూసివేసి సమ్మె చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వారికి ఏఐటీయూసీ, సీఐటీయూతో పాటు టీడీపీ నాయకులు తమ మద్దతు ప్రకటించారు.

విద్యుత్ పొదుపు పాటిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

కమలాపురం : విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించి భవిష్యత్తు తరాలకు వెలుగు నిద్దామని ట్రాన్స్‌కో ఏఈ చాంద్‌బాషా తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం క్రాస్ రోడ్డులోని సబ్‌స్టేషన్ నుంచి గ్రామ చావడి వరకు విద్యుత్ సిబ్బంది విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పొదుపు పాటించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించి భవిష్యత్తు తరాలకు వెలుగు నిద్దామన్నారు. ముఖ్యంగా సహజ కాంతినే వాడాలని, అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్ కాంతిని వినియోగించాలన్నారు. ఒక్క యూనిట్ కరెంట్‌ను ఆదా చేస్తే 10 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసిన వారమవుతామన్నారు. విద్యుత్ పొదుపును పాటిస్తే పర్యావరణాన్ని రక్షించనట్లేనన్నారు. విద్యుత్ పొదుపును జీవన విధానంలో అంతర్భాగం చేసుకోవాలన్నారు. ప్రతి పల్లెలో విద్యుత్ వెలుగులుంటే ఆ గ్రామం అభివృద్ధి చెందినట్లేనన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ కృపాకర్, లైన్‌మెన్లు, జేఎల్ఎంలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం

పులివెందుల రూరల్ : పట్టణంలో రోడ్డుపనులు జరుగుతున్న కారణంగా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసులు నడుపుతామని డీఎం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల కొత్త బస్టాండు నుంచి పులివెందుల ఓల్డ్ బస్టాండు వరకు, వయా ముదిగుబ్బ రోడ్డు, రంగనాథస్వామి ఆలయం, ధర్మవరం రింగ్ రోడ్డు మీదుగా వెళతాయన్నారు. అలాగే పులివెందుల ఓల్డ్ బస్టాండు నుంచి కొత్తబస్టాండుకు వచ్చేటప్పుడు శ్రీరాములు హాలు, పార్నపల్లె బస్టాండు ద్వారా వెళతాయన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ హాజీవల్లి తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

కడప కార్పొరేషన్: జనవరి నెల నుంచి అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్‌ను రూ.3వేలకు పెంచాలని రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానించడం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కో ఆపరేటివ్ కాలనీలో 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య, కార్పొరేటర్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, జేసీఎస్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, సేవాదళ్ అధ్యక్షుడు సమరనాథరెడ్డి, శంకరాపురం సింధు, మురళీ, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.

